## నేడు ఆమనగల్లుకు 'రామన్న' రాక

- ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్న మంత్రి
- మంత్రి సమక్షంలో పలు పార్టీల నుంచి భారీ చేరికలు
- సభకు 50వేల మంది వచ్చేలా శ్రేణుల సమాయత్తం
- ఏర్పాట్లు పర్యవేక్షించిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే



రంగారెడ్డి, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ ముందుకు సాగుతున్నది. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ముందుగానే అభ్యర్థులను ప్రకటించడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రచారంలో అన్ని పార్టీల కంటే ముందున్నారు. తొమ్మిదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రజల్లో ఆదరణ పెరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదివారం ఆమనగల్లుకు వస్తున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి విఠాయిపల్లి గ్రామానికి చేరుకుంటారు. అక్కడ బీఎన్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో వివిధ పార్టీల నుంచి వెయ్యి మంది మంత్రి సమక్షంలో పార్టీలో చేరనున్నారు. అక్కడి నుంచి మంత్రి ఆమనగల్లుకు బయలుదేరి 3.30 గంటలకు ఆమనగల్లులో మాడ్గుల రోడ్డులోని సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 50వేల మందితో భారీగా బహిరంగ సభను నిర్వహించేలా బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి.

### బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్..

కల్వకుర్తి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్ నియోజకవర్గవ్యాప్తంగా ఒక దశ ప్రచారం పూర్తి చేశారు. వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఇప్పటికే ఒక దఫా ఈ ప్రాంతంలో పర్యటించి బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. ఆదివారం మంత్రి కేటీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమనగల్లుకు వస్తుండడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం కనిపిస్తున్నది. ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల్, వెల్దండ, కల్వకుర్తి తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనం రానుండడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే మార్గంలో అవుట్‌స్కర్ట్స్‌లలో వాహనాల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. వెయ్యిమంది బీఆర్‌ఎస్ వలంటీర్లు సైతం సభా నిర్వహణలో పాలుపంచుకోనున్నారు.

### సభను విజయవంతం చేయాలి


కేటీఆర్ పాల్గొంటున్న ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణాన్ని బీఆర్‌ఎస్ కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్ శనివారం పరిశీలించారు. సభా నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను మంత్రి కేటీఆర్ ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ వైస్ చైర్మన్ గిరియాదవ్, బీఆర్‌ఎస్ పట్టణ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఖలీల్, పెద్ద శ్రీను, వెంకటయ్య, ఏఎంసీ డైరెక్టర్లు సుభాష్, రమేశ్, సాయిలు, ప్రసాద్, విక్రమ్, జహంగీర్ ఉన్నారు.

## నాలుగు నియోజకవర్గాల్లోనూ..

రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి మహేందర్‌రెడ్డి

# బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

- వలసవాదులను ప్రజలు నమ్మరాదు
- మళ్లీ గెలిపించండి.. అందరూ గర్వపడేలా పనిచేస్తా
- యువ ప్రభంజనం సభలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి



మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని సన్మానిస్తున్న యువకులు

తాండూరు, నవంబర్ 4 : యువత చేతుల్లోనే ఈ దేశ భవిష్యత్తు ఉన్నదని, వారే ఈ దేశాన్ని బాగు చేసుకోవాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గనులు, భూగర్భవనరుల శాఖల మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు విలేమూన్ మైదానంలో బీఆర్‌ఎస్ 'యువ ప్రభంజనం' సభను నిర్వహించారు. తాండూరు నియోజకవర్గంలోని యువకులు, బీఆర్‌ఎస్ శ్రేణులు జనమా.. ప్రభంజనమా అన్నట్టు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు. తాండూరులో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలోని 4 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమన్నారు. రాష్ట్రంలో తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్‌రెడ్డిని అత్యధిక భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. యువకుల ఉత్సాహం, ప్రజల నమ్మకం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా... ప్రతిపక్షాలు తలకిందులుగా తపస్సు చేసినా రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్రను సృష్టించబోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో, మహేందర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి తాండూరులో ఉన్నన్ని రోజులు తట్టుకునే శక్తి ఎవరికీ లేదన్నారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సీఎం కేసీఆర్ వదిలిన బుల్లెట్లు.. వాళ్లను తట్టుకొని నిలబడే దమ్ము, ధైర్యం రాష్ట్రంలో ఎవరికీ లేదని మంత్రి స్పష్టం చేశారు. గత తొమ్మిదిన్నర ఏండ్లలో తాండూరు నియోజకవర్గంలో రూ.1672.49 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ.1648.12కోట్ల సంక్షేమ పథకాలు ప్రజలకు అందించినట్లు తెలిపారు. తాండూరు పట్టణాభివృద్ధి పనులకు రూ.1191.86 కోట్లు, తాండూరు మండలంలో అభివృద్ధి పనులకు రూ.236.14 కోట్లు, యాలాల మండలంలో అభివృద్ధి పనులకు 97.77 కోట్లు, బషీరాబాద్ మండలంలో అభివృద్ధి పనులకు 68.18 కోట్లు, పెద్దేముల్ మండలం అభివృద్ధి పనులకు రూ.78.54 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

### ప్రజల ఆశీర్వాదంతో..

బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలు రాగానే కొందరు వలసవాదులు అడుక్కుతినే వాళ్లలా.. బయలుదేరారని ఎద్దేవా చేశారు.



తాండూరులో నిర్వహించిన 'యువ ప్రభంజనం' సభలో పాల్గొన్న యువత

తాండూరు ప్రజల ఆశీర్వాదంతో తప్పకుండా భారీ మెజార్టీతో గెలుస్తామన్నారు. మళ్లీ గెలిపించండి.. అందరూ గర్వపడేలా పనిచేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే ఎకరానికి రూ.16 వేల రైతు బంధు, సౌభాగ్యలక్ష్మి పేరుతో పేద మహిళలకు రూ.3000, రూ.400లకే వంటగ్యాస్, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం, కేసీఆర్ ఆరోగ్యరక్ష ద్వారా వైద్య చికిత్సలకు రూ.15 లక్షలు, రేషన్‌పై సన్నబియ్యం, అర్హులైన వారికి రూ.5016 ఆసరా పెన్షన్లు, అగ్రవర్ణ పేదలకు గురుకులాలు, స్వశక్తి మహిళా గ్రూపులకు భవనాలతో పాటు పలు నూతన పథకాలను ప్రవేశపెట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

### ఇష్టపడి.. కష్టపడేవారు లీడర్‌గా మారుతారు

వ్యక్తిత్వ వికాసకులు గంప నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. వ్యక్తి ఉదయం నుంచి రాత్రి వరకు అలసిపోకుండా ఉండేందుకు నేతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను జనాల్లోకి ఏవిధంగా తీసుకువెళ్లాలో వివరించారు. ఇష్టపడి కష్టపడేవారు లీడర్‌గా మారుతారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీశైల్‌రెడ్డి, బీసీ సంఘం ప్రతినిధులు డాక్టర్ అరుణ్‌కుమార్, రాజ్‌కుమార్, యూత్ నాయకులు అనిల్‌బాండ్, వెంకటేశ్‌చారి ఉన్నారు.



వెల్‌చాల్ నుంచి మోమిన్‌పేట వరకు యువత బైక్ ర్యాలీ

## అభివృద్ధికి పట్టం కట్టండి

మహేశ్వరం : నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు పట్టం కట్టాలని మంత్రి సబితారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని హర్షగూడలో జరిగిన 'గడపగడపకూ బీఆర్‌ఎస్' ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ. 280 కోట్ల నిధులతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. రూ.40 కోట్లతో అర్బన్ ఫారెస్టు పార్కులను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. పురాతన ఆలయాల పునరుద్ధరణ రూ.10 కోట్లు, రూ.450 కోట్లతో రోడ్లు, రూ.284కోట్లతో పంచాయతీరాజ్, రూ.160 కోట్లతో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆమె వివరించారు. అభివృద్ధి నినాదంతో ముందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు ఆదరించి గెలిపించాలన్నారు. నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న తనను ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని కోరారు. బీఆర్ పాలననే తెలంగాణకు శ్రీరామరక్ష అని ఆమె పేర్కొన్నారు.



మోమిన్‌పేట మండల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

# యువతకు ఆదర్శం కేసీఆర్

- మోమిన్‌పేట మండలంలో 10,000 మెజార్టీతో ఎమ్మెల్యే ఆనంద్‌ను గెలిపించాలి
- ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి
- వెల్‌చాల్ నుంచి మోమిన్‌పేట వరకు 5వేల బైక్‌లతో 10,000 మంది ర్యాలీ
- మోమిన్‌పేటలో మండల యువత ఆత్మీయ సమ్మేళనం

మోమిన్‌పేట, నవంబర్ 4 : సీఎం కేసీఆర్‌తో తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధిలో పరుగులు తీస్తున్నదని.. యువత కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి అన్నారు.శనివారం మండల పరిధిలోని వెల్‌చాల్ నుంచి మోమిన్‌పేట వరకు 5 వేల బైక్‌లతో 10,000 మంది యువత బైక్ ర్యాలీకి, ఏజేఆర్ ఫంక్షన్ హాల్‌లో మోమిన్‌పేట మండల యువత ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గత 60 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నేడు ఏ మొహం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ లేని ఆరు పథకాలను ప్రచారం చేస్తున్నారన్నారు. కేవలం 9 సంవత్సరాల్లో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు తీస్తున్నదన్నారు. 24 గంటల కరెంట్, రైతు బీమా, రైతు బంధు, సకాలంలో ఎరువులు, విత్తనాల పంపిణీ, రైతు వేదికలతో వ్యవసాయం పండుగలా మారి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. మిషన్ భగీరథ, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, పింఛన్ తదితర సంక్షేమ పథకాలతో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్కతలలో త్వరలో పరిశ్రమల నిర్మాణం జరుగనుందన్నారు. వికారాబాద్ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన అభ్యర్థి ఆనంద్‌ను కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎంపీ కోరారు.

### అసత్య ప్రచారాలను నమ్మవద్దు

ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. వికారాబాద్ జిల్లాకు విద్య, వైద్యం, పల్లె, పట్టణ మౌలిక వసతులు, రైల్వే బ్రిడ్జి నిర్మాణాలకు సుమారు రూ.900 కోట్ల నిధులను మంజూరు చేసుకున్నట్లు తెలిపారు. కేసీఆర్ పాలనలో మారుమూల గ్రామాలు కూడా అభివృద్ధిలో దూసుకుపోతూ అందంగా ముస్తాబయ్యాయని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం, స్థానికతను చూసి మరోసారి దీవించి బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆనంద్ కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారానికి కాలేజీ స్టాఫ్

- పాఠాలు బంద్‌పెట్టించి.. ప్రచారానికి పురమాయించి..
- కల్వకుర్తిలో వింత పరిస్థితి.. ముక్కున వేలేసుకుంటున్న జనం

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఆయనో విద్యావేత్త. ప్రజా ప్రతినిధి కూడా.. ఇంకా చెప్పాలంటే పారాచూట్ లీడర్. ఆయన ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియదు. రాత్రికి రాత్రే ఎమ్మెల్యే అయిపోవాలి అన్నట్లుగా ఆయన వ్యవహారముంటుంది. ఈ తొందరపాటుతోనే పార్టీ మారారు. ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ బీ ఫారం సంపాదించారు. కానీ ఆయనకంటూ కేడర్ లేదు. లీడర్లు ఆయన వెంటరావడం లేదు. ఇంకేం కాలేజీ సిబ్బందిని ఆయన ప్రచారానికి పురమాయించారు. తమ ఇంజినీరింగ్ కాలేజీ స్టాఫ్‌కు కాంగ్రెస్ కండువాలు వేసి ప్రచారంలోకి దింపారు. ఇంతకీ ఆయనెవరనుకుంటున్నారా..! ఆయనే కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి. ఇంతకాలం బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్సీగా కొనసాగిన ఆయన రాత్రికి రాత్రే కాంగ్రెస్‌లో చేరి పార్టీ టికెట్‌ను దక్కించుకున్నారు. వాస్తవానికి ఈ టికెట్‌ను నారాయణరెడ్డితో పాటు మరికొంత మంది నేతలు ఆశించారు. టికెట్‌ను నారాయణరెడ్డి ఎగరేసుకుపోవడంతో వారి కేడర్ ప్రచారానికి మొహం చాటేస్తున్నారు. ప్రచారానికి పార్టీ కేడర్ ముందుకురాకపోవడం, పరువుపోయే అవకాశముండటంతో హయత్‌నగర్‌లోని తమ ఇంజినీరింగ్ కాలేజీ లెక్చరర్లు, స్టాఫ్‌తో ప్రచారం చేయిస్తున్నారు. తమ విద్యాసంస్థల్లో పనిచేస్తున్నవారిని ప్రచారానికి వాడేస్తున్నారు. ఏకంగా పాఠాలు బంద్ పెట్టించి కల్వకుర్తిలో ఎన్నిక ప్రచారానికి వినియోగించుకుంటున్నారు. ఆయన పోరుపడలేక అధ్యాపకులు కాంగ్రెస్ కండువాలు ధరించి ఆ పార్టీకి ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధం. కానీ జీతాలిస్తున్నామన్న కారణంతో లెక్చరర్లను స్వకార్యానికి వాడుకుంటున్నారని అధ్యాపక సంఘాలు మండిపడుతున్నాయి. జేఎన్టీయూ అధికారుల దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కల్వకుర్తిలో గల ఈ వింత పరిస్థితిని చూసి, జనం ముక్కునవేలేసుకుంటున్నారట.